


# ఛ !

ఈనాడు ఆదివారం
18 ఫిబ్రవరి, 2007,

# ఛ!

"....సకల చరాచర జీవరాశులలోని ఒక జంతువును మనిషిని చేసింది – మాట. బుద్ధి వివేచనలకు సాయుధమై... భావోద్వేగాలకు మాధ్యమమై – ఒక సంస్కారవంతమైన జీవిగా మనిషిని తీర్చిదిద్దినది – మాట.

ఆలోచనలకు ఒక నిర్దిష్ట రూపాన్ని – అనుభూతులకు ఒక సున్నిత భాష్యాన్నీ ఇచ్చేది – మాటే!

పలుకు పలుకులో తేనెలొలుకుతూ మానవ జీవిత గమనాన్ని రసవంతం చేసేది – మాటే.

కనులతోనూ శరీరంతోనూ మనసుతోనూ... చివరకు మౌనంతోనూ మాట్లాడగల కళ మనిషికి తప్ప మరే జీవికి సాధ్యం?

ఏమీ మాట్లాడకుండానే ఎన్నో మాట్లాడగలగడం – ఒక్క మాటలో ఒక్క కదలికలో ఒక్క చూపులో అనేక అర్థాలు పలికించగలగడమూ మనిషికేగా సాధ్యం!

మనిషి జీవితానికి ఒక అర్థాన్ని ఇస్తూ జీవనాన్ని అర్థవంతం చేసేదీ –..."

ఆగకుండా మోగుతున్న ఫోను బృంద అక్షరాలను అర్థాంతరంగా ఆపేసింది.

చలికాలం. ఆపై ఆదివారం.

చుట్టూ మంచు. తెరలు తెరలుగా.

మర్నాడు సెమినార్‌లో పేపర్ ప్రెజెంట్ చేయాల్సిన పని లేకపోతే - బృంద హాయిగా వెచ్చగా మెత్తని పక్కలో ముడుచుకొని ఉండేది. ఇంకాసేపు.

స్పీచ్ థెరపీ కోసం ఓ ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్ డెవలప్ చేశారు బృంద కంపెనీ వారు. మార్కెట్‌లో విడుదల చేయడానికి ముందుగా స్పీచ్ థెరపిస్టులకు ఒక సెమినార్ నిర్వహిస్తున్నారు. బృంద పరిచయ వాక్యాలు రాస్తోంది. మాటే తెలియని పుట్టు మూగ, చెవిటి - వారికి ఇది మరో మాటగా అందివ్వాలని వారి ఆశయం.

ఫోన్ మోగుతూనే ఉంది.

'ఆగకుండా మోగుతోందంటే ఇది తప్పక కుండా ఆవలి తీరాన్నుంచి వచ్చిన ఫోనే!' బృంద గొణుక్కుంటూ బద్ధకంగా ఫోన్ అందుకుంది.

ఆమె బంధు మిత్రులందరిలోనూ తన ఈడువారిలో తెలుగునాట మిగిలి ఉన్నది బృంద ఒక్కతే. అందితే అమెరికా బ్రిటన్ అందకపోతే బెంగుళూరు చెన్నై -లేదా మరో మహానగరం - ఇదీ అందరింటి పరిస్థితి. వారు ఎక్కడెక్కడికి చేరినా వారి గుండె మాత్రం ఇక్కడే కొట్టుకుంటుంది.

ప్రతిరోజూ ఉదయాన్నే ఎవరో ఒకరి ఫోను.

"అమ్మను కలిసిరావే -" "నాన్నను పలకరించి రావా బృందా"

"హాయ్ బృందా - పిన్నికి పుట్టిన రోజు శుభాకాంక్షలతో పాటు ఫలాన బహుమతి ఇచ్చిరా - "

"చిన్న మామయ్యకి ఆపరేషన్ అన్నారంటే. అన్ని అవసరాలు చూసిరా - "

విన్నపాలు వినవలె వింతవింతలు. విజ్ఞాపనలు ఆజ్ఞలు వినయంగా స్వీకరించాలి. కొంతలో కొంతైనా అందరిలోకి చిన్నది కదా - ఏ మాత్రం సణిగినా గొణిగినా - అటునుంచి ఇటునుంచి మొట్టికాయలు. కొండకచో కోపాలు తాపాలు. అలకలు ఆగ్రహాలు.

ఏమైనా, అటు పిల్లలకు ఇటు వారి పెద్దలకూ - అన్నింటా తానే అయింది బృంద. అనుకోకుండా వారందరి జీవితాలు ఆమె జీవితంలో ఒక భాగమై పోయాయి. నిశ్శబ్దంగా,

'చూస్తూ చూస్తూ ఎవరి ఇబ్బందుల్లో వాళ్ళను ఎలా వదిలేయగలదు?

తెలిసి తెలిసి తను వాళ్ళకు చేయగలిగిన చిన్న చిన్న సాయాలు ఎలా చేయకుండా ఉండగలదు?

మనిషికి మనిషి మాటసాయం - అన్నారుగా పెద్దలు.

అంతేగా మరి?

ఈ మహానగరంలో నోరారా పలకరించే మనిషే కరువు. ఇక, మనసు విప్పి మాట్లాడడానికి మనసు తెలుసుకొని మాట్లాడుకోవడానికి వీలు ఎక్కడ? ఈ రూపేణా కొత్త బంధాలు ఏర్పడుతున్నాయి. తనకు కూడా ఇవన్నీ ఎంత అండాదండో మరి. 'బృంద గట్టిగా ఊపిరి పీల్చి వదిలింది.

"ఇప్పుడు ఎవరి ఫోనో ఎలాంటి వార్తో....." బృంద ఫోన్ చేతిలోకి తీసుకుంది.

ఆమె అంచనా నిజమే. అది అమెరికా నుంచి వచ్చిన ఫోను.

భార్గవి. మిన్నియాపోలిస్ నుంచి,

బృందకు స్వయాన పెద్దనాన్న కూతురు.

'ఏదో ముఖ్యమైన విషయమైతే తప్ప భార్గవక్క ఫోన్ చేయదు. ఏమిటో విశేషం?" బృంద కుతూహలంగా భార్గవి చెప్పేది వినసాగింది.

"బృందా...."

"అక్కా... వింటున్నా... చెప్పు..."

"ఇవాళ నువ్వు ఖాళీగా ఉన్నావా? రెండు మూడు గంటలు..." భార్గవి గొంతులో బరువు.

"రోజంతా ఖాళీనే గానీ, ముందు సంగతేమటో చెప్పక్కా..." బృందకళ్ళముందు సగం రాసిన ఉపోద్ఘాతం కాగితాలు రెప రెప లాడుతున్నా – నింపాదిగా అంది.

"నువ్వు వెంటనే వెళ్ళి అమ్మతో మాట్లాడి రావాలి." భార్గవి మాటల్లోని నిగూఢత బృందను స్పృశించింది. అయినా, కాస్త తేలికగానే బదులిచ్చింది.

"అలాగే అక్కా... ఏంటి విశేషం? పెద్దమ్మ నా కోసం పాలతాలికలు వండిందా?"

"బృందా... అట్లా మాటవరుసకు అనడం కాదు. నువ్వు అమ్మతో మా...ట్లా...డి.. రావాలి!" భార్గవి "మాట్లాడి" అన్న పదాన్ని పలికిన తీరులో బృందకు ఏదో తేడా ధ్వనించింది. అయినా, తన సహజ ధోరణిలోనే అంది.

"పెద్దమ్మతో మాట్లాడడం ఏమిటి... ఏకంగా పోట్లాడే వస్తాలే అక్కా...."

"వద్దు – మాట్లాడిరా చాలు!" భార్గవి పలుకుల్లో తొణికిన అవ్యక్త భావమేదో బృందను అప్రమత్తం చేసింది. నిటారుగా కూర్చుంది. జాగ్రత్తగా అడిగింది.

"అక్కా – ఏదైనా సమస్యా?"

"అమ్మ మాట్లాడి మూడువారాలైంది!" భార్గవి గొంతులో చిన్న పిల్ల స్వరంలోని అమాయకత్వం, పెద్దరికంలోని గాంభీర్యమూ ఒకేసారి వ్యక్తమయ్యాయి.

అంతే, బృంద మరింత అప్రమత్తమయ్యింది. కూడదీసుకుని ఏదో అడగబోయే లోపలే భార్గవి అంది.

"నాన్న సంగతి నీకు తెలిసిందే కదా బృందా – ఆయన లోకం ఆయనది. ఆయన లోకంలో అమ్మకూడా ఉందని ఆయన ఏనాడు అనుకోలేదు. ఇకపై, ఆ వాస్తవం గ్రహిస్తాడన్న నమ్మకం కూడా లేదు.

అమ్మకు ఆయనే లోకం.

తన పాటికి తను జీవించగలనని నాన్న నమ్మకం.

ఆయన లేని జీవితాన్ని అమ్మ ఊహించలేదు. మాటమాత్రానికైనా--"

"అక్కా..." బృంద భార్గవి భావోద్వేగానికి మధ్యలోనే అడ్డుపడింది." నువ్వు దూరాన ఉంటున్నావుగా – అందుకేనేమో ఎక్కువగా బాధపడుతున్నావు. పెద్దమ్మకి వంట్లో ఎలా ఉందో ఏమో – చిన్నపాటి నలతలు ఈ వయస్సులో సహజమేగా – నీకు చెపితే అనవసరంగా కంగారు పడతావనుకుందేమో.... నేను ఇప్పుడే వెళ్ళి విషయం కనుక్కొని – నీతో వివరంగా మాట్లాడతాగా. ఈ బృంద మీద భారం వేసేసి – నువ్వు ఫోన్ పెట్టేసి – హాయిగా నిద్రపో–"

"భారం కాదు బాధ్యత అనుకోవే బృందా – నాన్న నీతోనే కాస్త నోరు మెదిపి మాట్లాడతారు. అందుకేగా నీకు ఫోన్ చేసింది – "

'ఏదైతేనేంలే అక్కా – ఇక నేను చూసుకుంటాగా – నువ్వు నిశ్చింతగా ఉండు. ఏ విషయమూ నీకు వెంటనే చెప్తాగా ..."

భార్గవికి బోలెడంత భరోసా ప్రకటించేసి – బృంద ఆమెకు వీడ్కోలు పలికింది.

"కానీ, ఎలాగబ్బా?' బృంద నొసలు ముడిపడ్డాయి. 'పెదనాన్న ఏమన్నా సామాన్యుడా? హు!' బృంద నిట్టూర్చి కాగితాలు సర్దుకోసాగింది.

చేతుల పని చేతులు చేస్తున్నా ఆలోచనల పని ఆలోచనలు చేస్తున్నాయి.

బృంద పెదనాన్న, చంద్రమౌళి, ఆషామాషి వ్యక్తి కాదు. మొదటి వరస ప్రభుత్వాధికారి. ఓ ప్రతిష్టాత్మక యూనివర్సిటీలో లెక్కల్లో డాక్టరేట్ సాధించినవాడు. గోల్ట్‌మెడలిస్ట్. ఈ మధ్యనే స్వచ్ఛంద విరమణ చేశాడు. స్వంతంగా వ్యాపారం చేసుకొంటున్నాడు.

పెద్దమ్మ, భారతి, ఫిజిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తూ – పిల్లలు పుట్టాక ఉద్యోగం మానేసింది.

భార్గవి, భరత్‌లు వారి పిల్లలు. ఆమె భర్తా అమెరికాలో డాక్టర్లు. పిల్లా పాపలతో కుదురైన జీవితం. భరత్, చిన్నవాడు, ఈ మధ్యనే రెసిడెన్సీ పూర్తిచేశాడు. తన సహధ్యాయినే పెళ్ళాడాడు. ముచ్చటైన కాపురం. అమెరికా నివాసం.

భార్గవి అన్న మాట నిజమే. చంద్రమౌళి దగ్గర అతని పిల్లల కన్నా బృందకే కాస్త చనువు ఎక్కువ. బహుశా వాళ్ళిద్దరి మధ్య సాన్నిహిత్యానికి లెక్కలే కారణం కావచ్చును. ఆయన పిల్లలు ఇద్దరూ లెక్కలకు దూరం. ఇక, బృంద ఎప్పుడు సెలవులు వచ్చినా, పెదనాన్న దగ్గర చేరి లెక్కలు నేర్చుకొంటూ ఉండేది. ఆ విధంగా వారిద్దరి నడుమ కొంత చొరవ ఏర్పడింది. చంద్రమౌళి ఎప్పుడైనా మంచీ చెడు మాట్లాడాలంటే అదీ బృందతోనే.

బృంద కూడా అంతే. చదువు, ఉద్యోగం – చిన్న చిన్న సమస్యలు పెదనాన్నతోనే విప్పి చెపుతుంది. ఇక, పెద్దమ్మ సంగతి సరే సరి.

'బాదరబందీలు బాధ్యతలు ఏవీలేవు. మరి పెద్దమ్మ మనసు ఎందుకు నొచ్చుకుందో లోలోన ఏమని దిగులు పడుతుందో – ఎవరితో

పంచుకోవాలనుకుంటుందో -" బృంద ఇక ఆలోచనలను పక్కన పెట్టి - చంద్రమౌళి గారి ఇంటి దారి పట్టింది.

చంద్రమౌళి మాములు వ్యక్తి కాదు. తనని తాను అత్యాధినికుడిననీ - మహా నాగరికుడిననీ - విశ్వమానవుడిననీ నమ్మడమే కాక - ఆ విషయాన్నే అంతరాంతరాలలో జీర్ణించుకున్న వ్యక్తి.

తన అల్ట్రామోడ్రన్, మెట్రో పాలిటన్

కాస్మోపాలిటన్ భావాలను నడకలో నడతలో -మాటలో మన్ననలో - ఆహారం వ్యవహారంలో - ఒక్కటేమిటి అనుక్షణం స్పష్టంగా ప్రకటించేస్తుంటాడు.

ఆయన భావాల విషయం అటుంచి - ఆయన చేసిన ఉద్యోగాల వలన ఆయన చుట్టూ ఒక బ్రహ్మాండమైన వలయం సృష్టించబడింది. అదే, ఆయన ప్రపంచమై పోయింది. ఆయన అత్యాధునిక జీవనశైలి ఆద్యంతమూ బంధుమిత్రులందరినీ అంటీ ముట్టనట్లుగా అల్లంత దూరాన నిలబెట్టింది.

ఇక, భారతి ఆయనకు అన్నివిధాల సరిజోడని అందరి నమ్మకం. అయితే, ఆయన శైలికి ఈమెకూ పోలికలేదు. అణకువగా అల్లనమెల్లనగా సాగుతూ ఉంటుంది ఈమె వ్యవహారం.

ఎటు చూసినా, ఆడపిల్లలందరికీ చటుక్కున ఆమెను ఉదాహరణగా నిలబెట్టేవారు.

'ఆడపిల్లలంటే ఆమెలా ఉండాలి -' అంటూ.

ఈ విషయమే చంద్రమౌళి కూడా సగర్వంగా చెప్పుకుంటూ ఉంటాడు - ఎప్పుడైనా - 'భార్యంటే అలా ఉండాలి! అంటూ.

మరి పెద్దమ్మను ఏ విషయం నొప్పించి ఉంటుందబ్బా - ' వద్దనుకొన్నా వదలని ఆలోచనలు బృంద బుర్ర తొలుస్తూనే ఉన్నాయి.

వాటినేమిటినీ తన ముఖాన కనబడనీయకుండా - ఏమీ ఎరగనట్లుగా - ప్రసన్నవదనంతో కాలింగ్ బెల్ మోగించి - మునివేళ్ళపై నిలబడింది బృంద.

ఎప్పుడూ విప్పారిన నవ్వు ముఖంతో కళకళలాడుతూ భారతి వచ్చి తలుపుతీసేది. ఈ సారి ఇంటి వంటమనిషి, లక్ష్మమ్మ వచ్చి తలుపు తీసింది. నిశ్శబ్దంగా.

"పెదనాన్నా... పెద్దమ్మా ..." కేక పెడుతూ లోపలికి వెళ్ళబోయింది బృంద.

"సారు తోటలో ఉన్నరు. కాఫీ ఇమ్మంటరా?" లక్ష్మమ్మ ఓ సమాధానం ఓ ప్రశ్న విసిరేసింది.

"వేడిగా ఉండాలి! అక్కడికే తెచ్చి ఇస్తావా?" బృంద వేగంగా తోటవైపు వెళుతూ అంది. లక్ష్మమ్మ సమాధానం కోసం ఆగాలనుకోలేదు. బిగ్గరగా పిలుస్తూ వెళ్ళింది.

"పెదనాన్నా..."

"ఏమ్మా .. బృందా? చాన్నాళ్ళయింది ఇటువైపు వచ్చి. ఎలా ఉన్నావ్?"

"ఏముంది పెదనాన్నా మామూలే, పనుల వత్తిడి. ఇంటికి రాగానే మంచానికి అడ్డం పడ్డమే. మళ్ళీ తెల్లారి ఉరుకులు పరుగులు. ఉన్న కొద్ది సమయంలో ఎటైనా రావాలన్నా పోవాలన్నా - ట్రాఫిక్ పుణ్యాన ఏదో దూర ప్రయాణం చేసినట్లు అలసట -" అడిగిన వారిదే దోషం అన్నట్లు బృంద టకటక మాట్లాడుతూనే ఉంది.

చంద్రమౌళి చిరునవ్వుతో వింటున్నాడు.

గడగడ కబుర్లు, వేడి వేడి కాఫీలు అయ్యాక - సాధ్యమైనంత యాధాలాపంగా అడిగింది బృంద, "పెద్దమ్మేది? నేను వచ్చి ఇంత సేపయ్యింది. కనబడలేదు."

మొదట మాట్లాడలేదు. చంద్రమౌళి. బృంద రెట్టించేసరికి పొడిగా అన్నాడు.

"పైన గదిలో ఉంది!"

"స్నానం చేస్తుందా ఏమిటి?"

"ఏమో ఎవరికి తెలుసు?" ఈ సారి చంద్రమౌళి మాట విసురుగా వచ్చి పడింది, "స్నానమో పానమో జపమో తపమో-"

"పెదనాన్నా -" బృంద ఏదో చెప్పబోయింది.

"హ! తన గురించి తనేమనుకుంటుందసలు? మూడు వారాలు! మాట లేదు పలుకూ లేదు! మూగనోము పట్టి మూల గదిలో ముడుచుకు కూర్చుంది! ఆమెకే అంత అహం ఉంటే నాకెంత ఉండాలి?"

చంద్రమౌళి కుర్చీని కాళ్ళతో వెనక్కి తన్ని - లేచి నిల్చున్నాడు. మౌన పోరాటం! హు! ఆమెని నేను కాబట్టి భరిస్తున్నా! మగాడన్నాక కాస్త సరదాలు సంతోషాలు ఉండవా? ఎప్పుడూ ఆమె చుట్టూ తిరుగుతూ కూర్చోవాలా? కొంగు పట్టుకొని వేళ్ళాడాలా? వారమంతా కష్టపడతా! వారం చివరి రెణ్ణాళ్ళు అలా సరదాగా గడిపివస్తా! నా శైలి మొదటినుంచీ ఇంతే! నేను సంతోషంగా ఉంటే సహించలేదు!

రెణ్ణాళ్ళు మౌనం. భీష్మించుకొంటుంది. ఆమెకే అంత పొగరుంటే నాకెంత పొగరుండాలి? నేనో రెణ్ణాళ్ళు మాట్లాడకపోతే - ఆమే నెత్తీనోరూ కొట్టుకొని నా కాళ్ళ దగ్గరికి వస్తుంది!

నేను కాబట్టి ఆమెని సహిస్తున్నా- ఇంకొకరైతే -?" ఆ మాటలు గబుక్కున గుమ్మరించేసి చంద్రమౌళి చరచరా బయటకు వెళ్ళిపోయాడు.

'పెదనాన్న లాంటి పెద్దమనిషి నోట ఇలాంటి మాటలా? ఎటువంటి అడ్డూ అదుపూ లేకుండా - గుండెల్లో గుండుసూదులు గుచ్చినట్లు - ఈటెల్లాంటి సూటిపోటిమాటలా? 'బృంద నిర్ఘాంతపోయింది. కదలలేక మెదలలేక కుర్చీలోనే కూర్చుండి పోయింది.

'ఇంతటి కోపం! కట్టలు తెంచుకున్నట్లు! ఎన్నడూ కనీవినీ ఎరుగదు తను'- బృంద నిశ్చేష్టురాలైంది, 'భార్గవి అక్క అన్నది నిజమే- ఇది లోతైన విషయం. పైపైన వ్యవహారం కాదు!'

బృంద కాసేపు కూర్చున్న చోటే ఉండిపోయింది. ఆలోచనలన్నిటినీ క్రమబద్ధం చేసుకొంటూ- నెమ్మదిగా కూడదీసుకొంది. తిన్నగా భారతి గదికి వెళ్ళింది.

భారతి ఒక్కతే ఉంది. మంచం మీద ఓ ఆకారంలా.

కిటికీ తెరలు తీయలేదు. ఆ మాటకొస్తే తలుపులే తీయలేదు.

మూసిన గదిలో చల్లని నేల. మౌనం నలుమూలలా వేళ్ళాడుతోంది. ఘనీభవించిన శీతాకాలపు పొగమంచులా.

బృంద ఏమీ మాట్లాడకుండా - కిటికీలు తెరిచేసింది. తెరలు తొలగించేసింది. వెలుతురు వెల్లువలా గదంతా నిండిపోయింది.

బృంద తనకు సాధ్యమైనంత యధాలాపంగా - భారతిని పలకరించింది.

"ఏంటి పెద్దమ్మా... వంట్లో బాగుండలేదా..?" అడుగుతూనే లక్ష్మమ్మను ఓ కేకవేసింది. "లక్ష్మమ్మ.. నాకూ పెద్దమ్మకూ వేడి వేడి కాఫీ!"

"అమ్మానాన్న ఎలా ఉన్నారు?" బృంద ప్రశ్నకు సమాధానంగా మరో ప్రశ్న వచ్చింది భారతి నోట.

అంతే! బృంద గడగడ కబుర్లన్నీ గుమ్మరించేసింది. బంధుమిత్రుల బాగోగులని శుభాశుభాలనీ

భారతి త్వరగానే మాటల్లో పడింది. ఆ‌ఊల నుంచి.

బృంద మాట్లాడుతూనే భారతిని తరచి చూస్తోంది. బారతి కంటి కింది వలయాలు, పీక్కుపోయిన దవడలు, మెడ కింద ఉబ్బిన నరాలు - బృందకు ఎన్నో విషయాలు చెప్పాయి.

ఒక్కమాటనూ తూలకుండా జాగ్రత్తగా పేర్చుకున్నట్లుగా - మాట్లాడినట్లుగా ఉన్నప్పటికీ - మాటల మధ్యలో ఉద్వేగాన్ని అణిచి పెడుతున్నప్పటికీ - మెల్లిమెల్లిగా మాటల సయ్యాటలో మళ్ళీ ఓ కొత్త కళ వచ్చింది భారతిలో.

"అక్కాళ్ళు ఎలా ఉన్నారు పెద్దమ్మా - ఇంటికి ఎప్పుడు వస్తానన్నారు?"

"ఏమోనమ్మా- నీకే తెలియాలి. మీ అక్క విషయం. నేను మాట్లాడి చాన్నాళ్ళయింది."

"అదేంటి పెద్దమ్మా- నువ్వు ఒక్కపూట మాట్లాడకపోతే అక్క ఊరుకోదే! అక్క కాన్ఫరెన్స్ కేమైనా వెళ్ళిందా ఏంటి?"

"అలాంటిది ఏమీ లేదు .." భారతి కాసేపాగి అంది. స్పష్టంగా. " నేనే మాట్లాడలేదు-"

ఎందుకు ఏమిటి లాంటి ప్రశ్నలు వేయదలుచుకోలేదు బృంద. అలా వేయడం వలన ఆమె మాట్లాడడం ఎక్కడ మాని వేస్తుందోనని సంకోచిస్తూ - నిశ్శబ్దంగా వినసాగింది. శ్రద్ధగా.

"మాట్లాడాలనిపించ లేదు – " భారతి కాసేపాగి తనే అంది , "ఎవరితో కూడా –" మళ్ళీ మౌనం.

"ఏమని మాట్లాడాలి?"

నిశ్శబ్దం.

బృంద భారతి కళ్ళలోకి చూసింది. కళ్ళు మనసుకు వాకిళ్ళు అంటారు. కనులు మాటలాడుననీ –అంటారు. ఆశ్చర్యం! భారతి కళ్ళల్లో మాటలే లేవు. బ్రహ్మాండమైన శూన్యాల్లా ఉన్నాయవి.

ఏ భావమూ ఏ స్పందనా ఎరుగని గాజుగోళాల్లా –ఊహూ – కాదు కాదు – గాజుకైనా మెరుపు విరుపు ఉంటుంది. ఇవి ఏవీ లేవు –ఘనీభవించిన మౌనాల్లా ఉన్నాయి ఆమె కళ్ళు.

భారతి కాస్త తేరుకున్నట్లుగా ఉంది. లేచి మంచం మీద బాసింపట్టు వేసుకొని కూర్చుంది. మునివేళ్ళతో జుట్టును కాస్త పైకి ఎగదోసి ముడి వేసుకుంది. ముంతంత కొప్పు. నిజంగానే – భారతిది పొడవాటి అందమైన తలకట్టు. అక్కడక్కడ నెరిసిన వెంట్రుకలు జలతారు తీగల్లా మరింత అందాన్ని ఇస్తున్నాయి. వడలిన ముఖం, దుఃఖ భారంతో వంగిన శరీరం. ఒక విషాదభరిత వర్ణచిత్రంలా ఉంది.

భారతి లేచి నిలబడింది. తూలిపడబోయింది. తమాయించుకొని బాత్‌రూంలోకి వెళ్ళింది.

భారతి ముఖం కడుక్కొని వచ్చేలోగా, బృంద గబగబ గది స్వరూపాన్ని మార్చేసింది.

పక్కమీది నలిగిన దుప్పట్లు తీసేసి – ఇస్త్రీ దుప్పట్లు పరిచింది. దుప్పటి మీది విప్పారిన పూలు కిటికీలో నుంచి పలకరిస్తోన్న చేమంతులతో పోటీ

పడుతూ కళకళలాడుతున్నాయి. గదికి కొత్త జీవం వచ్చింది. తాజాగాలితో పాటుగా.

దిండు గలీబులు మారుస్తూ నిశ్శబ్దంగా కూర్చుంది బృంద.

భారతి కూడా అంతే. మౌనంగా జుట్టు దువ్వుకుంది. బొట్టు పెట్టుకొంది.

బృంద కాఫీ కప్పును భారతికి అందిస్తూ చొరవగా అంది, "పెద్దమ్మా – ఆకలి! ఆదివారం కదా – నువ్వు ఏదైనా కమ్మగా వండిపెడతావని ఇలా పొద్దున్నే వచ్చా –"

భారతి బృంద పక్కన వచ్చి కూర్చుంది. కాఫీ కప్పు పక్కన పెట్టింది. బృంద చేతి మీద చేయి వేసింది. ఆమె కళ్ళల్లోకి చూస్తూ – తేటగా అడిగింది.

"కాదు – నిన్ను భార్గవి పంపింది. కదరా?"

బృంద గతుక్కుమంది.

"అబద్ధం చెప్పినా అతికినట్లు చెప్పాలిరా –" భారతి మొదటిసారిగా నవ్వింది.

బృంద కూడా నవ్వేసింది.

ఒక్కసారిగా వాతావరణం తేలికపడింది.

"పిల్లలు దూరాన ఉన్నారు. అయితే మాత్రం, మేము వాళ్ళను గురించి ఆలోచిస్తున్నట్లే –వాళ్ళు మా గురించి ఆలోచించరూ? ఈమధ్య చాన్నాళ్ళయింది మాట్లాడి. మాకూ వాళ్ళకూ మధ్య ఉన్నది ఆ మాట సంబంధమే. మరి, భార్గవి భరత్ కంగారు పడకుండా ఎలా ఉంటారు? " ఎటువంటి భావోద్వేగం లేకుండా అంది భారతి.

"పెద్దమ్మా – అన్నీ తెలిసీ –"

"బృందా... ఎంతో కొంత తెలవడమూ ఒక్కోమారు ఇబ్బందమ్మా –" తలవంచి అలవోకగా నవ్వింది భారతి, "సరే, భార్గవికి చెప్పు. నాకు ఎవరి మీదా కోపమూ లేదు. ఏ విధమైన ఆరోపణా లేదు. ఒక విధమైన నిర్లిప్తభావం నన్ను కమ్మేసింది. ఒక రకమైన వైరాగ్యమే అనుకో – నిస్పృహలో నిరాశలో – నిగూఢమైన నిశ్శబ్దం నన్ను ఆక్రమించేసింది. ఒకటా – రెండా – నలభై ఏళ్ళ పై చిలుకు –"

భారతి గొంతు పూడుకుపోయింది.

బృంద తన చేతిని బిగించి పట్టుకుంది. ఓదార్పుగా. ఉపశమనంగా.

భారతి మాట్లాడడం మొదలుపెట్టింది. మహాప్రవాహంలా.

"నేను విసుగెత్తిపోయాను. మొదట్లో బిడియం. ఆ తరువాత భయం.

ఆయన ఎందుకు చీటికి మాటికి మౌనం వహించే వారో తెలిసేది కాదు.

నా వలన ఏ పొరపాటు జరిగిందోనని తల్లడిల్లి పోయేదానిని. ఏడ్చేదానిని. బతిమిలాడే దానిని. నా కట్టుబొట్టు, వంట వడ్డన, పిల్లల పెంపకం చదువులు, బంధుమిత్రులతో వ్యవహారం –ఏ విషయమై ఆయన మనసు నొచ్చుకొందో తెలిసేది కాదు. ఏ తప్పును నేను సరిదిద్దుకోవాలో తెలిసేది కాదు. అనుక్షణం అప్రమత్తమై పోసాగాను. నన్ను నేను నిందించుకొంటూ. సవరించుకొంటూ."

భారతి చెయ్యి అప్రయత్నంగా ఆమె గుండెపై పెట్టుకుంది. ఒక్కోమాట నింపాదిగా తేటగా పలుకుతోంది. ఎన్నాళ్ళగానో వాక్యనిర్మాణం చేసి పెట్టినట్లుగా. బృంద జాగ్రత్తగా వినసాగింది.

"ఉద్యోగం మానేశాను. ఇంటి గడపదాటితే ఆయనతోనే." భారతి ఓ క్షణమాగి మళ్ళీ అంది, "ఎప్పుడు నాలో ప్రవేశించిందో భయం. ఆయనంటే భయం. బెల్లు కొట్టిన వెంటనే తలుపు తీయడం ఆలస్యమైతే కోపం.

ప్రచండకోపం. వాకిట్లోనే అక్షింతలు. అడుగడుగునా అణువణువునా ఆయన కోపం ప్రకటించేవారు. మౌనంతో బిర్ర బిగిసిపోయేవాడు.

నాకూ కోపం వచ్చేది. ఫలానాది ఆయనకు నచ్చిందనో నచ్చలేదనో మాటమాత్రం చెబితే నేను మార్చుకోనా? అలక దాంపత్యంలోని తీయని జ్ఞాపకం అంటారు. అదేమోగానీ, నాకు మాత్రం చేదు అనుభవాల్నే మిగిల్చింది.

ఎప్పుడైనా కులాసాగా మాట్లాడుతూ ఉంటే – ఆకస్మాత్తుగా మౌనం.

పిల్లలతో సహా సరదాగా పకపకలాడుతూ ఉంటే – హఠాత్తుగా నిశ్శబ్దం.

అంతే – పిల్లలకూ నాకూ భయం. ప్రతి మాట మాట్లాడుతూ ఆయన స్పందనలను అంచనా వేసేవాళ్ళం. ఒక మాట మాట్లాడాలంటే ఎన్నిమార్లో ఆలోచించేవాళ్ళం. భయం భయంగా. మా ముగ్గురిలో ఒక సహజ వ్యక్తీకరణ అనేది లేకుండా పోయింది. మా ప్రమేయం లేకుండానే.

కుటుంబంలో నలుగురం.

తండ్రి దగ్గర గారాలు పోవాలని పిల్లలకు, భర్త సరసన సరాగాలు తీర్చుకోవాలని నాకూ – ఉండదూ? చనువుగా చొరవగా మాట్లాడలేకపోతే –ఇక, గారాలు మారాలు ఇవన్నీ ఎలా వీలు పడతాయి?"

భారతి కళ్ళు మూసుకొంది. కనురెప్పల కింద తన సంచలనాన్ని అదిమిపెడుతూ.

"మాట్లాడాలి. ఎన్నో మాట్లాడాలి. మాట్లాడకపోతే నేనేమిటో ఎలా తెలుస్తుంది? ఒకరితో ఒకరం నోరారా మనసారా మాట్లాడాలి. సహజంగా మాట్లాడాలి. ఎక్కడికక్కడ మాటకు ముందు పలుమార్లు సరిచేసుకొంటూ మాట్లాడే – ఈ నియంత్రణల జీవితం పట్ల నాకు అసహ్యం వేస్తున్నది. అణుకువగా –గౌరవంగా – మర్యాదగా – ఆకుకు అందకుండా పోకకు

కందకుండా - నాకు మాట్లాడాలని లేదు. ఎందుకంటే , అది అన్ని వేళలా వీలు పడదు. ఎలా వీలవుతుంది నువ్వే చెప్పు బృందా? ఎలాంటి అరమరికలు లేకుండా హాయిగా మాట్లాడుకోలేమా? పిల్లల్లాగా."

బృందకు ఎలా స్పందించాలో తెలియలేదు. ఆమె ప్రతిమాటతో ఏకీభవిస్తున్నప్పుడు ఏం మాట్లాడగలదు? పెదాలు తడిచేసుకొని నెమ్మదిగా గొణిగింది.

"పెద్దమ్మా .... ఇంతకు ముందెప్పుడూ... నువ్విలా...'

"బృందా - నిజమేరా. ఇంతకు ముందెప్పుడూ నేనిలా మాట్లాడలేదు. కానీ, నేను మాట్లాడాలని చాలా ప్రయత్నించాను. చుట్టూ ఇందరున్నా మాట్లాడే మనిషి కరువంటే నువ్వు నమ్మలేవురా... కానీ, చుట్టూ నీరున్నా దప్పిక తీర్చను నీటి చుక్క కరువు అయ్యే సందర్భం నీవు ఊహించగలవు కదా? ఉప్పొంగే సంద్రంపై వంటరి ప్రయాణం! నా కంటి నీరే నా చుట్టూ ఉప్పు సంద్రమై ఉప్పెనై నన్ను ఉక్కిరి బిక్కిరి చేసింది. ఇన్నాళ్ళు నేను నేను కాదు -"

భారతి ఓ క్షణం ఆగింది. పూడుకుపోతున్న గొంతును కూడదీసుకొంది.

"ఏళ్ళ తరబడి నాలోలోన అణచి ఉంచిన మాటలన్నీ నన్ను లోలోపలే తొలిచివేస్తున్నాయిరా -" భారతి బలంగా ఊపిరి పీల్చి వదిలింది". "నేను మీ పెదనాన్నతో ఎన్నో మాట్లాడాలనుకొన్నాను. మధుర భావనలు ముంచెత్తి నప్పుడు తీపిఊసులు కలబోసుకోవాలనుకొన్నాను. అమ్మా నాన్నలను కోల్పోయినప్పుడు కడుపారా ఆయనతో దుఃఖం పంచుకోవాలనుకొన్నాను. పిల్లలు ఎదుగుతున్న ప్రతిక్షణం ముద్దుమురిపాలు ఆయనతో కలిసి పంచుకోవాలనుకొన్నాను. ఉద్యోగం నాకు ఇచ్చిన స్వేచ్ఛ గురించి వివరించాలనుకొన్నాను.

నా శరీరానికి నొప్పి కలిగినా..., నా మనసుకనొచ్చుకున్నా ... నా బుద్ధి పరుగులు పెట్టినా.... మొదట ఆయనకే చెప్పాలను కొన్నాను. కానీ..కానీ.. నేను మాట్లాడలేకపోయాను.

నా సంతోషం, సంఘర్షణ, సంవేదన, సంబరం – ఏదీ... ఏదీ... విడమర్చి చెప్పలేకపోయాను. ఏ చిన్ని చిన్ని మాటలతో ఓ మానవ సంబంధం రమణీయం అవుతుందో – ఆ మాటలన్నీ నా లోలోనే ఇగిరిపోయాయి. మోసులెత్తకముందే మోడువారి పోయాయి. ఒక్కోమాట – ప్రేమ – మమకారం – బంధం – ఊహూ! ఒక నిర్లిప్తత నా చుట్టూ... నా లోలోన..."

ఒక్కోమాట భారతి గుండెల్లోంచి పొంగి వస్తున్నాయి. మెల్లి మెల్లిగా. బరువుగా.

"విసిగి పోయాను. ఇక మిగిలిన జీవితమంతా ఇలాగే గడపాలని నాకు లేదురా. ఒక మార్పును కోరుకుంటున్నాను. ఎలాంటి మార్పును కోరుకుంటున్నానో కూడా నేను స్పష్టంగా చెప్పగలను. కానీ... ఏ మార్పు తీసుకురాలేని ఆ అశక్తత నన్ను నిరాశలో ముంచెత్తుతోంది. నేను మనిషిని. నేను మాట్లాడకుండా ఎలా ఉండను?" భారతి మాట్లాడుతూనే ఉంది.

"నీకు లెక్కలంటే మహా ఇష్టం కదరా బృందా ... ఈ చిన్న లెక్క చెప్పరా... వారానికి రెణ్ణాళ్ళు ఆయన అలక. రెణ్ణాళ్ళు నా నిరాశ. ఓ రోజు నా బతిమిలాట. మరునాడు ఆయన బెట్టు. ఆ తరువాత రోజు ఆయన అజ్ఞాతం. మళ్ళీ మొదలు. ఈ క్రమంలో మా కుటుంబం సామరస్యంగా గడిపినవి ఎన్ని రోజులు? నెలకు ఎన్ని వారాలు? నలభై ఏళ్ళలో ఎన్ని నెలలు?" భారతి ఎంత నెమ్మదిగా అడిగినా – బృంద ఒక్కసారిగా నిర్ఘాంతపోయింది.

భారతి చెప్పిన లెక్క వేయడానికి చంద్రమౌళి గణిత పాండిత్యం అక్కర్లేదు. ఏ రెండో తరగతి పిల్లాడిని అడిగినా చెప్పగలడు. కానీ - ఇది లోతైన లెక్క. అంకెల గారడీ కాదు కదా?

ఒక్కమాటలో - వారి జీవితం!

"పెద్దమ్మా..." బృంద గొంతు గాద్గిగదమై పోయింది. భారతి చేయి నొక్కింది. తను సంభాళించుకోను.

"అలాంటి ఆలోచన నన్ను వెంటాడినప్పుడే - ఒక నిస్పృహ నన్ను మింగేస్తుందిరా. ఈ లోకం నుంచి నేను మాయమైపోతే బావుణ్ణు... అని అనిపిస్తుంది. ఛ! ఇంత చదువు చదివీ--"

గుమ్మం దగ్గర అలికిడి. చంద్రమౌళి. ఎప్పటి నుంచి నిలబడి ఉన్నాడో మరి!

భారతి, బృంద ఏమీ మాట్లాడలేదు. బృంద నెమ్మదిగా లేచి చంద్రమౌళి దగ్గరికి వెళ్ళి నిల్చుంది. గుమ్మానికి అటూ ఇటూ. నిశ్శబ్దం వారి మధ్య గడప.

భారతి ముఖం పాలిపోయి ఉంది. ముంతంత కొప్పు విడివడి నిడుపాటి వెంట్రుకలు ఆమె ముఖాన్ని చుట్టివేసాయి. ఆమె కనులలో దోబూచులాడిన భావమేదో చంద్రమౌళిని సూటిగా తాకినట్లుంది.

బృంద ఉదయం చూసిన చంద్రమౌళి కాదు ఇతను. బెట్టు అంతా ఆ ఒక్క చూపుతో సరి! మనిషి నీరు కారినట్లుగా - మనిషే నీరయినట్లుగా నిలబడి పోయి ఉన్నాడు. గుమ్మాన్ని ఆసరాగా చేసుకొని. గడ్డాన్ని ఎదపై వాల్చి. సాలోచనగా.

బృంద మొదట తేరుకొంది. చంద్రమౌళికే వినబడేట్లుగా అంది.

"ఇంత చిన్న లెక్క ఎలా తప్పావ్... పెదనాన్నా..." బృంద గొంతు పూడుకుపోయింది.

చంద్రమౌళి బృంద వంక తెల్లబోయి చూశాడు.

"అహానికి అహం – పొగరుకి పొగరు – లెక్క సరికాదు పెదనాన్నా... ఎదుటివారిలోని అహాన్ని అధిగమించ గల సంస్కారమూ మనలో ఉండవచ్చు కదా? నువ్వు.. నువ్వు... ఈ కుటుంబానికి పెద్దవి..."

చంద్రమౌళి కళ్ళు వాల్చేసాడు. వణుకుతోన్న పెదవిని బిగించిపెట్టాడు.

"నిరాశతో నిస్పృహతో పెద్దమ్మ ఏదైనా తొందరపాటు నిర్ణయం తీసుకొని ఉంటే...?"

చంద్రమౌళి విలవిలలాడిపోయినట్లుగా చివ్వున తలెత్తి చూశాడు.

"అది సరే, పెదనాన్నా, ఇన్నాళ్ళు ఎవరు ఎవరిని భరించారంటావ్ ?" బృంద అతని ముఖంలోకి లోతుగా చూస్తూ అంది, "పెదనాన్నా... మనిషికో మాట..." బృంద ఆ మాటను అర్ధాంతరంగా ఆపేసి – భారంగా బయటకు నడిచింది.

చంద్రమౌళి ఎంత మెత్తగా నడుస్తోన్నా ... భారతి వైపు సాగుతోన్న అతని బరువైన పాదాల సవ్వడి బృంద వెనకే వినబడింది. బృంద ఓ క్షణమాగింది. నిట్టూర్చి ఇంటిదారి పట్టింది. గుండెంతా పట్టేసినట్లయింది.

ఇంట్లో అడుగు పెట్టీ పెట్టగానే భార్గవి ఫోను.

"అక్కా... రేపు ఉదయం పెద్దమ్మ పెదనాన్న నీకు ఫోను చేస్తారు చూడు. నీవు నిశ్చింతగా నిద్రపో. ఇప్పుడు మీకు ఏ అర్ధరాత్రో దాటి ఉంటుంది." మరో మాటకు అవకాశం ఇవ్వకుండా ఫోన్ పెట్టేసింది బృంద.

అందరూ అనుకుంటున్నట్లుగా అణుకువ పెద్దమ్మ నైజం కాదు. అన్ని విధాలుగా ఆమె అణిచివేత మాత్రమే నిజం.

బృంద అర్థాంతరంగా వదిలేసి వెళ్ళిన కాగితాలు చేతిలోకి తీసుకుంది. అలాగైనా మనసు కుదుటపడుతుందేమోనని.

కాగితాలు తిరగేస్తుంటే - ఒక స్పష్టమైన ఆలోచన బృందను చుర్రుమనిపించింది.

'మాట ...ఎంత శక్తివంతమైనంది! ఒకే ఒక్కమాట! ఒక వ్యక్తి నిండు జీవితం.

ఆలస్యంగానైన పెద్దమ్మ పెదవి విప్పింది. కానీ, ఎందరు తమ జీవిత కాలంలో ఇలా మాట్లాడే అవకాశమే లేకుండా నలిగిపోతున్నారో ...!

పుట్టు మూగవారిని మాట్లాడించడం ఎలాగ అని ఓ పక్క ప్రయత్నిస్తుంటే -నోరుండీ పుట్టినప్పటి నుండి మూగమొద్దుల్లా ఎందరు జీవిస్తున్నారో...!

నోరు కుట్టేసి - నాలుకలు తెగకోసి - కాళ్ళు చేతులకు బేడీలు వేసి - తమ స్వార్థం కోసం బలహీనులను వినియోగించుకొన్నారే - చరిత్రలో ఒదిగిన ఆ అనామిక బానిసలు - అసంఖ్యాక బానిసలు - వారి మనసుల్లో ఎన్ని మాటలు సుళ్ళు తిరిగి ఉంటాయో...!

అవును. నిజం. మాటని నియంత్రించి వాళ్ళు మనిషిని నియంత్రించారు! చరిత్ర పుటల్లో మాట మాత్రపు ప్రస్తావన లేకుండా మరుగయ్యారు. ఆ మాట్లాడనివ్వని మనుషులందరూ.

వాళ్ళు కట్టు బానిసలు. ఆడవాళ్ళు పుట్టు బానిసలు.

ఇప్పుడు మన కళ్ళెదుట - నవనాగరీక సమాజంలో - నయానా భయానా ఎందరెందరిని మాట్లాడ నివ్వకుండా చేస్తున్నాం? నోరు మెదపనీయని ఈ దౌర్భాగ్యపు స్థితి మన చుట్టూ కనబడుతూనే ఉందిగా!

అంటే, ఆ మాట దోచేయబడిన మనుషులందరూ మానవజాతి పరిణామక్రమంలో ఒక అడుగు వెనక్కి నెట్టివేయబడినట్లేగా –?

అంటే... అంటే... వారిని మూగ జంతువుల్లా బతికేట్లుగా నియంత్రించి నట్లేగా –?' బృందకు ఒక్కసారిగా దిమ్మ తిరిగి పోయినట్లయింది.

"ఛ!" బృంద అప్రయత్నంగా బిగ్గరగా అంది. వెన్ను జలదరింపు వదిలేలా.

మళ్ళీ భార్గవి ఫోను.

"బృందా... అమ్మా నాన్నా ఇద్దరూ ఇప్పుడే మాట్లాడారు. భరత్‌తో కూడా మాట్లాడారట."

బృంద మౌనంగా వింటోంది.

"నాన్నను ఎలా మార్చేశావ్...?" భార్గవి గొంతులో ఎక్కడలేని కుతూహలం!

"నేనేమీ మార్చలేదు. అయినా, పెదనాన్నేమీ దుష్టుడు, దుర్మార్గుడు కాదు. మామూలు మనిషి. కొన్ని సంకుచిత భావాల మధ్య ఇరుకుగా పెంచబడిన మనిషి. ఆయనేమైనా తెలివి తక్కువవాడా? పెద్దమ్మంటే ఆయనకు ప్రాణమని మనకు తెలియదూ? మాట పట్టింపే కానీ –"

"నిజమే బృందా – ఇంతకీ ఏం మందు వేశావే?"

"పెద్దమ్మే వేసింది! ఈ జీవరాసులన్నిటి లోనూ పరిసరాలకు అనుగుణంగా తనను తాను మలుచుకోగలిగిన అద్భుతశక్తి ఉన్నది మనిషికేగా? పెదనాన్న చుట్టూ ఆయన మాటే గెలిచే వాతావరణం ఉంది. ఆ డొల్లలోనే ఆయన ముడుచుకు పోయారు. ఇన్నాళ్ళూ ఆయనే మాట్లాడేవాడు. ఇకపై మీరందరూ మాట్లాడతారని గ్రహించారు. అంతే –!"

భార్గవి చిన్న పిల్లలా సంబరపడుతూ అంది – "ఏమైనా ఒక్కమాటతో నాన్నలో ఎంత మార్పొచ్చిందే –"

140బృందను భార్గవి సంబరం కదిలించలేకపోయింది. కానీ, 'ఒక్కమాట' అన్న పదం భారతి  మాటలను స్ఫురింపజేసింది.

'ఆ ఒక్కమాట - "నోర్ముయ్!" అని కణకణ కాల్చిన కమ్చీ దెబ్బలాగా నన్ను అమాంతం వచ్చి తాకేది. ఆ మాట ఆయన పెదవిని ఎన్నిమార్లు దాటిందో కానీ, ఆయన కంటి సైగతో - కనుబొమ విరుపుతో - నొసటి ముడుతతో - చేతిసైగతో -ఎన్ని రకాలుగా మాట్లాడ వచ్చునో అన్ని రకాలుగా- ఆ మాట నన్ను వచ్చి తాకేది. ఆ ఒక్క మాట - చిన్న మాట - నా మాటలన్నిటినీ మింగేసింది - ఇన్నేళ్ళుగా -' భారతి ఆపై మాట్లాడలేక పోయింది. మాట ఆగింది.

బృంద తేరుకొని సాలోచనగా స్పందించింది-

"భార్గవక్కా... ఈ మాత్రానికే చిన్న పిల్లలా సంబరపడి పోకే... ఇప్పుడేగా పెదనాన్న మనుషుల్లో పడ్డాడు! మనిషిగా ఎదగనీ!"

"అదేంటే?" భార్గవి అయోమయంగా అంది.

"అక్కా - చంపనొంప వెయ్యేల... ఒక్క మాట చాలదా?"

కథా నిలయం
శ్రీకాకుళం

రచన
ప్రారంభం 10 జనవరి 2007
ముగింపు 11 జనవరి 2007